# సమన్వయ లోపం.. ప్రజలకు శాపం!


బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

## అంబర్‌పేట నియోజకవర్గంలో అధ్వానంగా రోడ్లు

- అభివృద్ధి పనుల పేరిట రహదారుల తవ్వకాలు
- పనులు పూర్తయినా మళ్లీ మరమ్మతులు శూన్యం
- నిత్యం ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డు
వామాక్షి విద్యానికేతన్ వద్ద ఒక వైపే వేసిన రోడ్డు
నల్లకుంట పాతరామాలయం వైపు వెళ్లే దారి..

**నల్లకుంట:** జీహెచ్‌ఎంసీలోని ఇంజనీరింగ్, జలమండలి, ఇరిగేషన్ నాలా విభాగాల అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. నియోజకవర్గంలో ఓ పక్క నాలా పనులు, మరోపక్క జలమండలి డ్రైనేజీ, సీవరేజీ పనుల కోసం ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వుతున్నారు. అయితే సదరు పనులు పూర్తయి ఏడాది గడిచినా తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**నల్లకుంట డివిజన్ పరిధిలో..**

నల్లకుంట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడడమే కాకుండా నడుం నొప్పులతో బాధపడుతున్నారు.

- నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో రెండేళ్ల క్రితం ఇరిగేషన్ విభాగం అధికారులు నాలా పనులు చేపట్టారు. పూర్తయి ఏడాది గడిచినా తవ్విన రోడ్లకు మాత్రం మరమ్మతులు చేపట్టలేదు. దీంతో నారాయణగూడ, చిక్కడపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వైపు వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నల్లకుంట పాత రామాలయానికి వెళ్లే దారిలో వామాక్షి విద్యానికేతన్ వద్ద రోడ్డుకు ఓ వైపు మాత్రమే సీసీ రోడ్డు నిర్మించి మరో వైపు అలాగే వదిలేశారు. అలాగే ఇదే రోడ్డులో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి వెళ్లే కూడలిలో పూర్తిగా రోడ్డు గుంతల మయంగా మారింది. బాక్స్ నాలా పనులు పూర్తై ఏడాది కావస్తున్నా రోడ్డు అసంపూర్తిగా నిర్మించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నల్లకుంట మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ పక్కన (స్ట్రీట్ నంబర్ 8లో)

- నల్లకుంట స్ట్రీట్ నంబర్–8లో 8 నెలల క్రితం డ్రైనేజీ వర్షపు నీటి పైపు లైన్ పనులు చేపట్టారు. అప్పుడు రోడ్లను తవ్వి పనులు పూర్తయ్యాకా రోడ్లకు మొక్కుబడిగా ప్యాచ్ వర్క్స్ చేపట్టి జీహెచ్‌ఎంసీ అధికారులు చేతులుదులుపుకున్నారు.
- నల్లకుంట రైల్వే ట్రాక్ లేన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. అంబర్‌పేట, తిలక్‌నగర్ నుంచి వచ్చే వాహనదారులు శంకరమఠం వైపు వెళ్లేందుకు తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద రైట్ టర్న్ తీసుకుని ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. అయితే గుంతలుగా మారిన రోడ్డు కారణంగా వాహనదారులు తరుచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

### నేడు వరల్డ్ ఆక్యుపంచర్ డే వేడుకలు

**ముషీరాబాద్:** వరల్డ్ ఆక్యుపంచర్ డేను పురస్కరించుకుని తెలంగాణ ఆక్యుపంచర్, ఆక్యుప్రెజర్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌కు చెందిన విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం సెమినార్ నిర్వహించనున్నట్లు డాక్టర్ నేలపట్ల సుధీర్, ప్రొఫెసర్ డాక్టర్ పీబీ లోహ్యాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే సెమినార్‌కు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ కే లక్ష్మణ్, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

### సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

**కాచిగూడ:** బీసీలకు రాజ్యాధికారం కులగణన ద్వారానే సాధ్యమని, సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. కాచిగూడలో శనివారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు ఈ సర్వేనే పునాదిరాయి అవుతుందని పేర్కొన్నారు.

### ‘ఆ కులాలను బీసీ జాబితాలో చేర్చండి’

**కాచిగూడ:** బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి అదే జాబితాలో చేర్చాలని బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి సర్వే, విచారణ చేపట్టకుండానే 2014లో తెలంగాణ ప్రభుత్వం 60 ఏళ్లుగా బీసీ జాబితాలో ఉన్న 26 కులాలను తొలగించిందన్నారు. ఈ విషయమై 11 ఏళ్లుగా బీసీ కమిషన్‌కు మొరపెట్టుకున్నా, సుప్రీంకోర్టుకు వెళ్లి వాదనలు వినిపించినా పరిష్కారం దొరకలేదన్నారు. తొలగించిన కులాల్లోని 30 లక్షల మందిని తెలంగాణలో లేని కులంగా భావిస్తూ, ఇటీవల ‘కులగణన’ నిమిత్తం కోడ్‌లు కేటాయించిన 246 కులాల్లోనూ ఈ 26 కులాలు లేకపోవడం బాధకరమన్నారు. బీసీల్లో ఏబీసీడీ కాకుండా ఏ నుంచి కే వరకు గ్రూపులు ఇచ్చి అందరికీ అవకాశం కల్పించాలని కోరారు. తొలగించిన 26 బీసీ కులాలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి కనీసం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అయినా వచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

### రేపటి బీసీల సమరభేరికి రండి

**కాచిగూడ:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిశారు. ఈనెల 25న రవీంద్రభారతిలో నిర్వహించనున్న ‘బీసీల సమరభేరి’ సభకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. వారి వెంట బీసీ నేతలు తంగెళ్లముడి నందగోపాల్, నీల వెంకటేశ్, ఉదయ్‌నేత, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ ఎవరి సొత్తూ కాదు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ప్రతిభ ఎవరి సొత్తూ కాదని విద్యార్థులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని హైకోర్టు న్యాయవాది విద్యాసాగర్ అన్నారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రం వద్ద తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో నాలుగో పిల్లల జాతర శనివారం ముగిసింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పిల్లలను ప్రోత్సహించేందుకు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

### బర్కత్‌పురలో కాంగ్రెస్ నేతల సంబరాలు

**కాచిగూడ:** వయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంక గాంధీ 4 లక్షల మెజార్టీతో గెలుపొందడంపై అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత కేపీ మురళీకృష్ణ నేతృత్వంలో నేతలు, కార్యకర్తలు శనివారం బర్కత్‌పుర చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. నాని, కుమార్, జీ సోను, సత్యనారాయణ, కిరణ్, కుమార్, రామకృష్ణ, ప్రసాద్, రాజేశ్, బీరప్ప పాల్గొన్నారు.


కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం శనివారం 15వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. – కవాడిగూడ

### ‘మహా’ విజయంపై బీజేపీ నేతల సంబరాలు

**కాచిగూడ:** మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి భారీ మెజార్టీతో గెలుపొందడంపై కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్ నేతలు, కార్యకర్తలతో కలిసి కాచిగూడ, నింబోలిఅడ్డలో శనివారం స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కృష్ణ కుమార్, శిరీసాగర్, సుభాష్ పటేల్, అరవింద్, వాసు, బీ భీమ్ రాజ్, సూరి, రవియాదవ్, బాలప్రసాద్, నాగు, రాము, తారా, సంతోష్, రామకృష్ణ పాల్గొన్నారు.

### పలు రైళ్లలో దొంగతనాలు

**కాచిగూడ:** సెవెన్ హిల్స్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని కేబీహెచ్‌బీకాలనీకి చెందిన యోగానందరెడ్డి భార్య అరుణకుమారి (55) సెవెన్ హిల్స్ రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. అనంతరం బ్యాగు చూసుకునేసరికి అందులో 43 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు కన్పించలేదు. దీంతో శనివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

**వెంకటాద్రి రైల్లో..**

వెంకటాద్రి రైల్లో ప్రయాణికుడి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన శివకుమార్ కుమారుడు కిరణ్ కుమార్ (43) వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అనంతరం బ్యాగు చూసుకునేసరికి అందులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు కన్పించలేదు. శనివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

### వృద్ధుడి అదృశ్యం

**కాచిగూడ:** వృద్ధుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుందర్‌నగర్‌కు చెందిన నర్సింహులు (74) గత నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

**కాచిగూడ:** నగరంలో గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 50 లక్షల విలువైన 114 కిలోల గంజాయి, రూ.3200, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన బీ గోవింద్, రాజమండ్రికి చెందిన ఏ.ప్రకాశ్ కుమార్, అనకాపల్లికి చెందిన ఎం.మోహన్‌రావు, ఒంగోలుకు చెందిన ఆర్‌డీ హరిప్రసాద్, అనకాపల్లికి చెందిన కే రమణ గంజాయి సప్లై చేస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లారు. తిరిగి వచ్చాక వీరంతా ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని మళ్లీ గంజాయి సరఫరా చేస్తున్నారు. ఒడిశాలో కిలో గంజాయిని రూ.1500 లకు కొనుగోలు చేసి రూ.5000 కు విక్రయిస్తున్నారు. అనకాపల్లికి చెందిన ఎల్.గంగాధర్, వై.గంగాధర్‌తో కలిసి (ట్రాన్స్‌పోర్టు) గంజాయిని నగరానికి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కొటిక్ పోలీసులు, కాచిగూడ పోలీసులతో కలిసి ప్రత్యేక నిఘా వేశారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సరఫరా చేస్తున్న సమయంలో వారిని అరెస్ట్ చేశారు. వీరంతా హైదరాబాద్‌లో కేజీకి రూ.25వేల చొప్పున గంజాయిని విక్రయిస్తున్నారు. సమావేశంలో నార్కొటిక్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్, ఎస్‌ఐ సీ వెంకటరాములు, కాచిగూడ ఎస్‌హెచ్‌ఓ కే చంద్రకుమార్, ఎస్‌ఐ హెచ్.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిఘటన మాస పత్రిక ఆవిష్కరణ

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు ప్రతిఘటన మాస పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమకాలిన పరిస్థితులు రాజ్యాంగ పరిరక్షణ, దళితులు, బలహీన వర్గాల చట్టాలు వంటి కీలక అంశాలతో ప్రతిఘటన మాసపత్రికను ప్రచురించామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ట్రేడ్ యూనియన్ నాయకులు డీజీ నర్సింహారావు, ఎం. కురుమయ్య, పాలడుగు నాగార్జున, ఎస్ మనోహర్, లలిత, రాధాకృష్ణ, సురేశ్, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అవగాహన పెంపొందించాలి



**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జరోజా వివేక్, హైస్కూల్ ప్రిన్సిపాల్ విఠలాచారి, మేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు

**కవాడిగూడ:** సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సూచించారు. ముషీరాబాద్ తహసీల్ కార్యాలయంలో ఎంఆర్‌వో రాణాప్రతాప్‌సింగ్‌తో కలిసి హిమాయత్‌నగర్, ముషీరాబాద్ మండలాల పరిధిలోని 285 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జీ రచనశ్రీ, కే రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జీ వెంకటేశ్, పరిమళ్‌కుమార్, మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యాంయాదవ్, వై.శ్రీనివాస్‌రావు, రాకేశ్ కుమార్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, నాయకులు ఎండీ సాయికృష్ణ, శివముదిరాజ్, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.



### పైపులైన్ పనులు షురూ



**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్ సబర్మతీనగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి వాటర్ వర్క్స్ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్ కుమార్ స్పందించి వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్‌తో కలిసి పైపులైన్ పునరుద్ధరణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆదేశాల మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, వాటర్ బోర్డు గాంధీనగర్ సెక్షన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ పనులను పరిశీలించారు. బీజేపీ నేతలు ఉమేశ్, డీ కుమార్, లక్ష్మణ్, టీ యాదగిరి, జగన్, రామ్మూర్తి, శ్రీను పాల్గొన్నారు.

### సీనియర్ జర్నలిస్టు, రచయిత విద్యాభూషణ్ మృతి

ఎయిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత


విద్యాభూషణ్(ఫైల్)

**ముషీరాబాద్:** సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకుడు, రచయిత విద్యాభూషణ్ (69) 3 రోజుల క్రితం బ్రెయిన్ హేమరేజ్‌తో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విద్యాభూషణ్ శ్రీకాకుళం ఉద్యమ ప్రేరణతో విప్లవ పార్టీలో చేరి కొంతకాలం కార్యకర్తగా పని చేశారు. శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యుడిగా కొనసాగారు. అనంతరం హైదరాబాద్‌లో వచ్చి పలు దినపత్రికలు, వార, పక్ష పత్రికల్లో పని చేశారు. పలు పత్రికలకూ విశ్లేషణలు కూడా అందించారు. ఆయన భౌతిక కాయాన్ని విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌కు తీసుకురాగా పలు ప్రజాసంఘాల నేతలు, నాయకులు, పలువురు జర్నలిస్టులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పొలిట్ బ్యూరో సభ్యుడు కేజీ రాంచందర్, కే రమ, న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు, ఝాన్సీ, కే గోవర్ధన్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, ఎం.హన్మేశ్, కే సూర్యం, ఎం.శ్రీనివాస్, ఎస్ఎల్ పద్మ, కేఎస్.ప్రదీప్, అనసూయతో పాటు పలువురు జర్నలిస్టులు కూడా నివాళులర్పించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు కుటుంబ సభ్యులు అందించారు.


నివాళులర్పిస్తున్న నేతలు

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**నల్లకుంట:** కార్తీక మాసం చివరి శనివారం కావడంతో న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం (న్యూరామాలయం) ప్రాంగణంలో గల సర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**రేపు పంచదారాభిషేకం..**

కార్తీక మాసం చివరి సోమవారం (రేపు) శివుడికి పంచదార అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు తెలిపారు. అనంతరం శివుడికి ప్రత్యేక పూజలు, హారతులు ఉంటాయన్నారు. ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు సహస్ర లింగాకార దీపాలంకరణ ఉంటుందన్నారు. అలాగే మాస శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 29న సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల కల్యాణం ఉంటుందని పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనేవారు ఆలయ అర్చక స్వామి, గుమస్తాను సంప్రదించాలని ఆయన సూచించారు.



**శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో వ్రతాలు..**

**చిక్కడపల్లి:** ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధిచెందిన శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పీ లక్ష్మారెడ్డి, అర్చకులు ఈ కాశీనాథ శర్మ, భవనందశర్మ, జగన్‌మోహనచారి, బుచ్చమ చారి, గోపాల్‌చారి, నరసింహమూర్తి, రామాచారి, అచారి భక్తులు, భక్తబృందం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీ పార్వతీ సమేత క్షీరాలింగేశ్వరస్వామికి, వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎం.దేవనాథం, అర్చకులు ఝుగ లక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి, వేణు, శర్మ, చారి భక్తులు, భక్తం బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయిబాబా జయంతి



**నల్లకుంట:** నల్లకుంట శివం మందిరంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఓంకారం, సుప్రభాత సేవ, మహా నగర సంకీర్తన (రథోత్సవం)తో ప్రారంభమయ్యాయి. శివం పరిసర ప్రాంతాలు సత్యసాయి భక్తులు ‘ఓం శ్రీ సాయిరాం’ అంటూ సాయిబాబా రథాన్ని అంబర్‌పేట, నల్లకుంట పురవీధుల గుండా లాగారు. అనంతరం శివం మందిరంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిత్యపూజ నిర్వహించారు. అలాగే సత్యసాయి చిత్రపటం వద్ద విద్యార్థులు వేదపఠనం, గురువందనం పేరుతో సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం సాయి సహస్ర నామాళి, సామూహిక పారాయణ జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం జ్యోతి ప్రజ్వలన కావించారు. సాయంత్రం 6.35 గంటలకు నిర్వహించిన సాయినామం మధురం భజన కార్యక్రమం ఆకట్టుకుంది. 7.35 గంటలకు కేక్ కట్ చేశారు. మంగళహారతితో జయంత్యుత్సవాలు ముగిశాయి. వచ్చే ఏడాది సాయిబాబా 100వ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని శ్రీ సత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ. మల్లేశ్వర రావు తెలిపారు. సత్యసాయి ట్రస్ట్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ హెచ్‌జే. దొర, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.